# దిగివచ్చిన దేవతలు

అదో చిన్నపల్లె. అక్కడొకటి అక్కడొకటి గుడిసెలు ఓ నలభై దాకా ఉంటాయి. ఆ గుడిసెల లాగానే అందులోని మనుషులు వెన్నుకు అంటుకుపోయిన కడుపులతో ముడుచుకుపోయి ఉంటారు. ఆ పల్లెలో గుడిసెలేగాక అంతో ఇంతో ఆస్తి ఉన్న ఓ పది పెంకుటిళ్ళు కూడా ఉన్నాయి. వాళ్ళ పొలాల్లో కూలిచేస్తూ ఈ గుడిసెవాసులు బ్రతుకుతున్నారు.

అది మిట్టమధ్యాహ్నపువేళ. ఆ పల్లెలోని మనుషులంతా పొట్టకూటికి పనికి వెళ్ళారు. ముసలీ, ముతకా, పిల్లా, జెల్లా ఎండకు తట్టుకోలేక గుడిసెల్లోనూ, చెట్ల నీడల్లోనూ తల దాచుకుని ఉన్నారు.

ఆ సమయంలో గుడిసెముందు వేపచెట్టు క్రింద వాల్చిన కుక్కిమంచంలో పడుకుని ఉన్నాడు నరసయ్య. చేతి కర్ర మంచం కోడుకు ఆనించబడి ఉంది. మీసాల్లో కలిసిపోయి జీబురుగా పెరిగిన గడ్డం, ఎండిన పెదాలు, గుంటలుపడ్డ కళ్ళు, అస్థిపంజరానికి చర్మం తొడిగినట్లున్న శరీరం, నడుముకు చుట్టుకున్న ఓ గోచిగుడ్డ, అతని ఆకారం. ప్రస్తుతం నూటరెండు డిగ్రీల జ్వరంతో మూలుగుతున్నాడు.

అదే సమయంలో అలాంటి శారీరక స్థితిలోనే ఉండి రవికె లేకుండా చిరుగుల చీరను ఒంటికి చుట్టుకుని ఉన్న అతని భార్య సీతమ్మ. పీకల దాకా కల్లుతాగి పెళ్ళాన్ని కూలికి పంపి హాయిగా గుడిసెలో కునుకుతీసి లేచిన ఒక్కగానొక్క తమ కొడుకుతో తన బాధ మొర పెట్టుకుంటోంది.

"ఒరే నాయనా! మీ నాయన చిన్నట్నించి జెరంలో ఉండాదురా. కొత్త అట్టా ఊళ్ళోకి ఎల్లి పంతుల్ని కేకేసి రారా. మాత్రి స్తడు" అంది ఏడుపు గొంతుతో.

"ఏందే. మీకు గంజి పోయడానికి మామిప్పటికే సచ్చిపోతున్నం. ఇంక మీకు వైద్దిగం ఏడ జేయించమంటవ్. ఇప్పటికే సూడు, మల్లి ఎట్టయిపోయిందో దిగులుతో" భార్య గుర్తుకొచ్చి బాధపడిపోయాడు.

"ఒరే మీ నాయన నిన్ను సిన్నతనంలో ఎంత గారాబంగా పెంచిండురా. నువ్వే కులదైవమని ఇప్పటికీ అనుకుంటున్నడ్రా. ఇప్పుడు గాని మాత్రేయకపోతే మీ నాయన సచ్చిపోతడ్రా" ఏడుస్తూ అంది సీతమ్మ.

"ఏందే నీ సొద. సస్తే సావనీ. పీడా వదిలిపోద్ది. నన్ను ఇసిగించ మాకు" అంటూ విసురుగా లేచి, తుండుగుడ్డ విదిలించి భుజాన వేసుకుని బయటకు వెళ్ళిపోయాడు.

వంగిపోయిన సీతమ్మ కొడుకు మాటలకు ఇంకా ఒంగిపోయింది. తను రక్తం పంచుకుని పుట్టిన బిడ్డ, తాము రక్తం ధారపోసి పెంచిన బిడ్డ ఆడపిల్లల్ని శనిముండలంటూ నిర్లక్ష్యం చేసి వీడ్ని తలకెక్కించుకుంటే చివరకు వీడు చేసిన దేమిటి ? శరీరం వణకుతుండగా కర్ర ఆధారంతో ఇంట్లోనుంచి బయటికి నడిచింది. ఆమెకు గత స్మృతులు కళ్ళముందు కదలాడుతున్నాయి.

ప్రపంచంలో రకరకాలయిన వ్యక్తులుంటారు. వారికి రకరకాలయిన కోరిక లుంటాయి. అవి వారికి న్యాయసమ్మతంగా ఉంటే ఇంకొకరికి విచిత్రంగా ఉంటాయి అలాంటి కోవకు చెందినవాళ్ళే నరసయ్య దంపతులు.

నరసయ్య ఎంత మంచివాడో, సీతమ్మ అంత ఓర్పు గలది. సీతమ్మ తల్లి లాగానే కష్టాల్ని భరిస్తూ ఉంటుంది. సీతమ్మకు ఏటా కాన్పే. సంకలో ఒక బిడ్డుంటే, కడుపులో ఒక బిడ్డుండేది. ప్రతి కాన్పూ ఆడపిల్లే.

నరసయ్య దంపతులు మగపిల్లవాడి కోసం స్వాతి చినుకు కోసం ఎదురుచూసే ముత్యపుచిప్పలా ఎదురు చూసేవాళ్ళు. వాళ్ళ దృష్టిలో కొడుకనేవాడు ఇంటికి వారసుడు. తమను ముసలితనంలో ఆదుకునే దేవుడు. ఆడపిల్లలంటే ఎప్పుడయినా ఇల్లొదిలిపెట్టి మొగుడువెంట వెళ్ళే వాళ్ళే.

ఎలాగయితేనేం, పదిమంది ఆడిపిల్లల తరువాత సీతమ్మ కొడుకుని కన్నది. ఇంకేముంది నరసయ్య ఆనందం పట్టశక్యం కాకుండాపోయింది. కొడుక్కి రాజా అని పేరు పెట్టాడు. ఉన్న దాంట్లోనే అతి గారాబంగా పెంచాడు. ఆడపిల్లలందరికి ఆజ్ఞలు జారీ చేసాడు. రాజాను ఏమనడానికి వీలులేదని, రాజా రాజాలాగే పెరిగాడు. రోజులు గడుస్తున్నాయి. ఆడపిల్లలు పెళ్ళిళ్లయి వెళ్ళిపోయారు. గారాబం ఫలితంగా రాజా మొండి వాడుగా సోమరిపోతుగా తయారయ్యాడు. ఒకరోజు తల్లిదండ్రులకు చెప్ప కుండా ఒక పిల్లను తీసుకొచ్చి ఇది నా పెళ్ళాం అన్నాడు. అప్పటికే నరసయ్య, సీతమ్మ ముసలివాళ్ళయిపోయారు. ఇక కొడుకు కోడలు మీద ఆధారపడి బ్రతక్క తప్పలేదు. కొడుకు పట్టించుకోకపోవడం, కోడలు రుసరుసలు వాళ్ళకు బాధాకరంగా ఉంది....

ఆలోచనల్లోంచి ఇవతలికి వచ్చి భర్త మంచాన్ని సమీపించింది సీతమ్మ.

తన కొడుకు అన్నమాటలే గనక తెలిస్తే ముసలాయన గుండె పగిలి చస్తాడనుకుంది సీతమ్మ. నెమ్మదిగా కర్ర ఆడించుకుంటూ నరసయ్య మంచం దగ్గరకెళ్ళి నిలబడింది. ఆమెకు తెలుసు. ఊళ్ళో నాటువైద్యం

చేసే పంతులు తనలాంటి వీదోళ్ళింటికి రాడని, అందుకే భర్తను అక్కడికే తీసుకువెళ్ళాలనుకుంది.

"ఏమయ్యో, కొద్దిగా కళ్ళు తెరువు" అంది మంచం మీదికి ఒంగి.

నరసయ్య నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. కాలువగట్టున దుబ్బుగా పెరిగిన గడ్డిలాగా గడ్డం మీసాల మరుగున ఉన్న పెదాలు చిన్నగా విచ్చుకున్నాయి.

"యాడికే సీతా" అన్నాడు వినీ వినిపించనట్లు.

"యాడికేందయ్యో, రాత్తిరి నుంచి ఒళ్ళు కాలిపోయే జెరం. ఇంకా ఇట్నే ఉంటవా ఏంది? పంతులు దగ్గరికెల్దాం పద. మాత్తరేత్తడు."

"వద్దులేయే. అదే తగ్గిపోద్ది. పొద్దుగూకే ఏళకల్లా."

"ఇదుగో సూడు. నువ్వేమన్నా వయసులో ఉండవా ఏంది తట్టుకోవడానికి నామాటినిలెయ్య."

భార్య నెమ్మదిగా మందలించేసరికి ఇక లేవక తప్పలేదు నరసయ్యకు.

నెమ్మదిగా మంచంమీద లేచి కూర్చుని కర్ర పట్టుకుని నిలబడ్డాడు.

ముందు సీతమ్మ నడుస్తూ ఉంటే, ఆమె చేయి పట్టుకుని నడుస్తున్నాడు నరసయ్య. అది మధ్యాహ్న సమయం. ఎండ నిప్పులు చెరుగుతూ ఉంది. పశువులు తిరగడంలేదు. పక్షులు ఎగరడంలేదు. అన్నీ నీడన ఉన్నాయి. ఆ సమయంలో క్రింద మండిపోతున్న నేల చెప్పులు లేకపోవడంతో చుర్రుమనిపిస్తోంది. పైన ఎండకు ఏ ఆచ్ఛాదన లేని వీపులు కాలివి పెనుముల్లా తయారవుతున్నాయి. కడుపులో మంట ఆర్పడానికి ఉదయంనుంచి ఇద్దరిలో ఎవరూ దోసెడు గంజి కూడా త్రాగలేదు. ఆ నిశ్శబ్ద సమయంలో ఇద్దరి చేతుల్లోని కర్రలు భూమిని తగిలి ఒక పద్ధతి

ప్రకారం శబ్దం చేస్తున్నాయి. అరగంట తరువాత వాళ్ళు ఆ పల్లెలోనే ఉన్న నాటువైద్యుడి ఇంటికి చేరుకున్నారు.

బయట వరండాలో ఇద్దరూ ఉస్సురుమంటూ కూలబడిపోయారు. నరసయ్య కూర్చునే శక్తి కూడా లేక వెల్లికిలా పడుకుని రొప్పసాగాడు. సీతమ్మ పరిస్థితి కూడా అంతే. అయితే కాస్త నిగ్రహం చూపింది. ఒకప్పుడు కాయకష్టం చేసిన శరీరాలు కావడంతో ఈనాడు కూడా బాధల్ని ఓర్చుకోగలుగుతున్నాయి.

బయటికి వచ్చి చూసిన నాటువైద్యుడు "ఏంది సీతమ్మా. ఇట్లా వచ్చినవు" అని, "అరె.... నరసయ్యకేం బాగాలేదా" అంటూ నరసయ్య ప్రక్కనే గొంతు కూర్చుని నాడి చూసాడు.

"ఏంది సీతమ్మా. ఎప్పట్నుంచి జెరం" అనడిగాడు.

"రాత్రినుంచి స్వాములూ."

"అయితే ఇంత ఎండలోనా తీసుకువచ్చేది. ఉదయాన్నే నీ కొడుకుని పంపిస్తే ఏదో మాత్రఇచ్చి పంపకపోయానా."

"ఆడికి తీరికలేదు సాములో. పొద్దున్నే కూలికెళ్ళిండు. రెక్కాడి తేనే డొక్కాడే బతుకులు గదా మాయి."

"ఎందుకు సీతమ్మా. కొడుకునట్లా సమర్థిస్తావు. మీ ఇంట్లో సంగతులు నాకు తెలియవా. వాడు ఇప్పుడు ఈ వీధి వేపచెట్టు దగ్గర నిలబడి అందరికీ ఉపన్యాసాలు చెబుతున్నాడు. పాపం 'కొడుకో, కొడుకో' అంటూ నరసయ్య కొడుకుని కన్నందుకు ఏం ప్రయోజనం."

సీతమ్మ పంతులు మాటలకు చాలా బాధపడిపోయింది. తను ఇంత కాలం కొడుకు పెట్టే బాధల్ని ఎవరికీ చెప్పుకోలేదు. కాని ఊళ్ళో అందరూ తమని గమనిస్తూనే ఉన్నారన్నమాట. ఏమయినా కొడుకుని గురించి అంతా ఇలా అనుకోవడం, చాలా బాధగా ఉంది ఆమెకు.

పంతులు ఇంట్లోకి వెళ్ళి ఓ మాత్ర, సత్తుగ్లాసుతో నీళ్ళు సీతమ్మ కిచ్చి "ఈ మాత్ర మ్రింగించు" అన్నాడు.

సీతమ్మ అతికష్టం మీద భర్త నోరు తెరచి మాత్రవేసి గొంతులో నీళ్ళు పోసింది. గుటకవేసి మ్రింగాడు నరసయ్య.

పది నిముషాలు చూసి మళ్ళీ పరీక్షచేసిన పంతులు "లాభంలేదు సీతమ్మా. ఈ మాత్ర ఏం పని చెయ్యలేదు. దీనికి ఇంజక్షను పడాల్సిందే."

"ఎయ్యండి సామే. తమ దయ."

"నా దగ్గరిప్పుడెక్కడిది సీతమ్మా. డబ్బులిచ్చి ఎవడ్నన్నా టౌనుకు పంపాలి."

సీతమ్మ బలహీనమైన గుండె ఒక్కక్షణమాగి కొట్టుకోసాగింది.

"ఎంతవుతది సామే."

"ఇంజెక్షను రెండ్రూపాయలు. పొయ్యొచ్చినోడికి ఇంకో రూపాయ. నీ కొడుకెళ్ళి గనక ఇంజక్షను తెస్తే ఆ రూపాయ మిగలద్ది" అన్నాడు పంతులు.

సీతమ్మకు నిరాశతో కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

రోజుకు రెండు పూటలు గంజిపోసే దానికే కొడుకు సణుగు తుంటే ఇప్పుడు రెండు రూపాయల ఇంజెక్షను పట్నంకెళ్ళి తెస్తాడా. అంతా కల్ల అనుకొంది. వాడ్నడిగి లేదనిపించుకొనే కంటే ఊళ్ళో ఎవరి దగ్గరన్నా మూడ్రూపాయలు అప్పు తెచ్చుకోవచ్చు అనుకుంది. అలా అనుకుందేగాని తనను జూసి ఎవరిస్తారనే సందేహం కూడా ఉంది.

"సామే. ఇప్పుడే వస్తా డబ్బులు తీసుకుని" అంటూ కర్ర తాటించుకుంటూ ముందుకు కదిలింది.

"ఇదుగో ఇంజెక్షను రాసిస్తా. డబ్బులు తీసుకుని అక్కడ్నించే ఎవుడ్నన్నా పిల్లోడ్ని టౌనుకు పంపు" అంటూ కాగితంమీద ఏదో వ్రాసిచ్చాడు.

ఆ ఎఱ్ఱని ఎండలో ఆ ఊళ్ళో ఉన్న ప్రతి ఇల్లూ తిరుగుతోంది సీతమ్మ అప్పుకోసం. ఆ సమయంలో ఎవరు ఉంటారు ఇళ్ళ దగ్గర. అందరూ కూలికి వెళ్ళి ఉంటారు. ఇళ్ళ దగ్గరున్న ముసలివాళ్ళు తమ దగ్గర ఏమీ లేదని చెబుతున్నారు. ఒకవైపు శరీరం శోష వచ్చినట్లు పడి పోతూంది. కాని అనుకున్న పని ఏమీ కాలేదు.

ఇక సీతమ్మ మనసులో ఒకటే ఆలోచన. ఎలాగయినా తన భర్తను రక్షించుకోవాలి. ఎలా? ఎలా? తన దగ్గరేముంది. ఒకటే ఒక టుంది. అదే. అదే తాళిబొట్టు. పట్నంవెళ్ళి అదీ కుదువబెట్టి డబ్బులు తెచ్చి భర్తను రక్షించుకోవాలి. ఈ ఆలోచన రాగానే ఆమెకు వేయి ఏనుగుల బలం వచ్చినట్లయింది.

అంతే....

ఆ ఎఱ్ఱటి ఎండలో ఒంటరి బాటసారిలా ఉన్న కాలిబాట వెంట నడవడం మొదలుపెట్టింది. శరీరంలో కొత్తగా పుట్టిన ఉత్సాహంవల్ల అయిదు మైళ్ళ దూరంలో ఉన్న పట్నం ఆమెకు పెద్ద దూరం అనిపించ లేదు.

* * * *

నరసయ్య మెల్లగా తల విదిలించేడు. ముఖంమీద చల్లని నీళ్ళు పడేసరికి. ఎదురుగా నాటువైద్యుడు పంతులు. రెండు చేతులెత్తి నమస్కారం పెట్టాడు నరసయ్య.

"నీకేం భయంలేదు గాని, కాసేపు పడుకో. సీతమ్మ సమయానికి నిన్నిక్కడికి తీసుకురావడం చాలా మంచిదయింది."

అటూ ఇటూ చూసి అడిగాడు నరసయ్య "అదేడికి బోయింది సామే."

"ఆమె నీకు ఇంజక్షను కొనడానికి డబ్బులుతేను బోయింది గాని, నువ్వింక కాసేపు పడుకో" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

నరసయ్య ఉలిక్కిపడ్డాడు. 'మందులు కొనడానికి డబ్బులు తేవ డానికి ఎళ్ళిందా ? ఏడుందయి డబ్బులు దాని పిచ్చిగాని. రాత్రంతా గంజి లేకుండా తన పక్కనే కింద పడుకొని దొర్లాడుతుండింది తనకు తెలియదా. కూడుపెట్టని కొడుకు డబ్బులిస్తాడని ఎట్టనుకొాందదీ. దానికీ అభిమాన మనేది ఉంది. ఇంతికాలం ఒళ్ళు గుల్ల జేసుకుని తాము ఎంతో అభి మానంగా కొడుకుని సాకితే, వాడికిప్పుడు తాము చేదయ్యారు. అదీ దానికీ తెలుసు.'

ఇక ఉండలేకపోయాడు నరసయ్య. అటూ ఇటూ చూసాడు. పంతులు ఇంట్లో ఎక్కడో ఉన్నాడు. ఇదే సమయమనుకున్నాడు.

ఒంట్లో ఉన్న సత్తువంతా కాళ్ళలోకి తెచ్చుకొని లేచి నిలబడ్డాడు. కర్ర పట్టుకుని ఉన్న చేయి వణికింది. కాళ్ళు తడబడ్డాయి. ఒక నిముషం నిలబడి గుండె కుదుట చేసుకున్నాడు. నడిచిపోతున్న శవంలా ముందుకు అడుగులు వేయడం మొదలుపెట్టాడు.

వీధిలోకి అడుగుపెట్టిన నరసయ్యకు ఎదురొచ్చిన ఎనిమిదేళ్ళ పిల్ల వాడు చెప్పాడు. "తాతో.... అవ్వ ఇట్టా ఊదీనబడిపోయింది.

"ఎట్టా" కంగారుగా అడిగాడు నరసయ్య.

ఊరు వదిలి అడవిపైపున వెళ్ళే కాలిదారి చూపించాడు వాడు.

నరసయ్య వాడి మాటలు నమ్మక కొద్దిదూరం నడచి మిగతా పిల్లల్ని కూడా అడిగాడు. వాళ్ళంతా అదే దారి చూపించారు.

నరసయ్య అడుగులో అడుగు వేస్తూ ఊరు దాటాడు. ఊరు దాటి ఊరికి ఉత్తరం వైపుగా నున్న కాలిబాట వెంట నడవడం మొదలు పెట్టాడు. అతని మెదడులో ఒకటే ప్రశ్న. 'సీత రాత్రినుంచి కడుపులో గుక్కెడు గంజిలేని నువ్వు ఇంత ఎండలో ఏడికి పోయినావు. నా జెరం నంగతి సూసినవేగాని నీ శక్తి సంగతి అలోచించక పోతివే' అని ఏడుస్తు న్నాడు.

నరసయ్య శరీరంలో నూటొక్క డిగ్రీ జ్వరం, పైన నిప్పులు చెరిగే ఎండ, విసురుగా ముఖాన తగులుతున్న సెగగాలి, ముందే ఎండి పోయి ముందుకు వంగి ఉన్న శరీరం, ఈ ఎండకు ఇంకా ఎండిపోయింది. నడుంమీద నాలుగు మూరలు గుడ్డ తప్ప శరీరంమీద ఇంకే ఆచ్ఛాదనా లేదు.

నరసయ్య వడివడిగా నడుస్తున్నాననుకొంటున్నాడు. అది అతని ఊహ మాత్రమే. అడుగులు పడినచోటనే పడుతున్నాయి. ఏమాత్రం దూరం జరగడంలేదు. గొంతు ఎండుకు పోతోంది. 'దాహం.... దాహం' అని అరుస్తున్నాడు. మాట బయటకు రావడంలేదు. శరీరం బెండులా తేలి పోతూ ఉంది.

నడుస్తూ, నడుస్తూ నరసయ్య దారిలోనే ఒకచోట కూలిపోయాడు.

* * * *

నరసయ్య కళ్లు తెరిచేసరికి మొట్టమొదటిగా తన మంచం ప్రక్కనే కూర్చుని కన్నీళ్ళు తుడుచుకుంటూ ముక్కు చీదుకుంటూ కనిపించింది, అతని భార్య సీతమ్మ. చుట్టూ చూసిన అతనికి చుట్టూ నిలబడి తన ముఖంలోకే చూస్తున్న తొమ్మిదిమంది కూతుళ్ళు కనిపించారు..

"నేనే డుండను."

"నాయనా! నీకేం భయంలేదు. నువ్వు నా ఇంట్లో ఉండావు. ఇంద మాత్ర మింగు" అంది పెద్దకూతురు దుప్పటి క్రిందనుంచి మాత్ర తీస్తూ. రెండో కూతురు గ్లాసుతో నీళ్ళు తెచ్చింది.

మూడో కూతురు తండ్రి వీపుచుట్టూ చేయివేసి లేపి కూర్చో బెట్టింది. నాలుగో కూతురు విసనకర్రతో తండ్రికి విసరసాగింది. అయిదో కూతురు తండ్రి కాళ్ళు పట్టసాగింది.

మిగతా కూతుర్లు కళ్ళు తుడుచుకుంటూ ఏడుస్తున్నారు. అందరూ వివాహితులే.

"నేనీడ కెందుకొచ్చినా" అన్నాడు మాత్రమింగి గతం ఆలోచించ డానికి ప్రయత్నిస్తూ నరసయ్య.

"అదంతా పెద్ద కత. ఆనక సెప్తాన్లే" అంది అతని భార్య సీతమ్మ.

"నాకేందో అయోమయంగా ఉందాదే. సెపితేగాని నాకు మతి కుదరదు" అన్నాడు.

చెప్పడం మొదలుపెట్టింది పెద్దకూతురు. "అయ్యా. ఇయ్యాల మనూరు కొండయ్య ఇక్కడి కొచ్చినప్పుడు మా నాయన, అమ్మ ఎట్టుండ రని అడిగిన. మీ సంగతి అంతా చెప్పిండు. తమ్ముడు మిమ్మల్ని సరిగ్గా సూడ్డం లేదని నువ్వు జెరంలో ఉండావని. అంతే కూడు గబగబా వండు కొని అంత తిని, మిగతాది సంచిలో పెట్టుకుని మనూరికి బయలుదేరినా. ఊరు కొద్దిదూరం ఉందనగానే ఒక సెట్టుకింద కూర్చుని అమ్మ ఒకటే ఇదిగా ఏడుస్తా కనిపించింది. నాయన కేటయిందని ఏడుస్తూ అడిగినా. నీ సంగతంతా సెప్పింది. అమ్మకు నడిసే ఓపిగ్గూడా లేదు. ఆమెను బతిమ లాడి కూసంత అన్నంపెట్టా. కొద్దిగా బలం వచ్చింది. ఇద్దరం కలిసి వత్తున్నం. కొద్దిదూరం వచ్చేసరికి నువ్వు దార్లో బోర్లాపడి ఉన్నవ్. అమ్మా, నేనూ భోరున ఏడుస్తూ నిన్ను లేవదీసినం. నీ శరీరం కాలిన నిప్పులా ఉంది. ఎంటనే నిన్ను భుజాన ఏసుకుని నిన్ను మా వూరికి తీసు కొచ్చినా. నిన్నటినుంచి నీ అల్లుడు రోజూ డాకటర్ని తీసుకొచ్చి సూపిత్తుం డడు. అల్లుళ్ళంతా జూసి ఎల్లిరను. చెల్లెళ్ల మాత్రం ఉండారు" సవిస్తరంగా జరిగింది చెప్పింది.

"అమ్మా మీ తమ్ముడు రాలేదా."

"ఇంకా ఆడిమీద ఆశెందుకు నాయనా. ఆడికోసం మీ పెద్దల్లుడు రెండుసార్లు ఊరికి బోయొచ్చిండు. వాడు రానని ఖండితంగా చెప్పేసిండు. ఎందుకు నాయనా ఆడికోసం పాకులాడ్డం. నీకు తొమ్మిదిమంది కూతుళ్ళ

ముండం. మీకెక్కడున్నా జగమెల్లి పోద్ది. మేం బతికే కష్టంలోనే మీకింత పెడతం నిన్న మేమంతా అనుకున్నం. ఉదయం, సాయంత్రం మీ అల్లుళ్ళంతా వచ్చి రోజూ చూసి పోతున్రు. మాకు లేకపోయినా మిమ్మల్ని కంటికి రెప్పలా చూసుకుంటాం" అంది పెద్దకూతురు. మిగతా కూతుర్లు అవునన్నట్లు తలలూపారు.

నరసయ్య ఆనందం అంతా ఇంతా కాదు. ఆడపిల్లలని శనిముండలని, దయ్యాలని, తను చిన్నతనంనుంచి హీనంగా చూసాడు. కొడుకు కోసం ఎంతకాలం ఎదురుచూసి కొడుకు పుట్టగానే వాణ్ని రాజాలా పెంచాడు. చివరకు అవసానదశలో వాడు గెంటేస్తే వీళ్ళు కడుపులో పెట్టుకుని చూస్తున్నారు.

నరసయ్యకు తనూర్లోని ఒక మహావృక్షం గుర్తొచ్చింది. అదీ ఎన్నో శాఖోపశాఖలతో తరతరాలుగా ఉన్న మామిడిచెట్టు. అన్ని కొమ్మలు తియ్యని మామిడిపండ్లు కాస్తే, అదేమి విచిత్రమో దక్షిణంవైపు నున్న ఒకేఒక కొమ్మ మాత్రం పుల్లని మామిడికాయలు కాస్తుంది. అది దేవుని సృష్టి. అలాంటిదే తన జీవితం కూడా. తను బలంగా భూమిలోకి పాతుకుని ఉన్న వేళ్ళయితే తన భార్య మహావృక్షం. శాఖోపశాఖలుగా చీలిపోయిన కొమ్మలు తన సంతానం. అందులో దక్షిణంవైపు నున్న కొమ్మ తన కొడుకు.

కూతుర్లవైపు నీళ్ళు నిండిన కళ్ళతో చూసాడు కృతజ్ఞతా పూర్వకంగా. వాళ్ళు ఇప్పుడు అతని కంటికి శనిముండలుగా కనిపించడం లేదు. దిగివచ్చిన దేవతలుగా కనిపిస్తున్నారు. నరసయ్య కళ్ళలోకి ఉప్పొంగిన ఆనందబాష్పాలను ఆప్యాయంగా తన పైటచెంగుతో తుడిచింది రెండవ కూతురు.